# ఒక దృశ్యం : మరొక చిత్రం

ఊరినుంచి చిన్నాన్న పంపిన డబ్బు రామానుజులుకు సమయానికి అందింది.

చివరి సంవత్సరం పరీక్షలు బాగా రాసి, డిస్టింక్షన్ తప్పక వస్తుందనుకుంటున్న సంతోష తరుణంలో ఆ డబ్బు అందింది. ఆట విడుపుగా ఒక వారం రోజులపాటు సత్యనారాయణ వెంట విశాఖపట్నం, అరకులోయ చుట్టి ఇంటికి పోదామనుకున్నా. నిర్ణయం ఒక కొలిక్కి వస్తుందో, రాదో, సఫలమవుతుందో, కాదో, అని సందేహాలు మునిగిన క్షణాల్లో అందింది. డబ్బు చేతిలో వచ్చిపడుతూనే రామానుజులుకు వాళ్ల చిన్నాన్న మీద ప్రేమ పెల్లుబికింది. గౌరవం మరింత పెరిగింది. పిల్లల అవసరాల్ని గుర్తించ గలిగిన పెద్దవాళ్ల మమకారానికి విలువ కట్టలేం అనుకున్నాడు.

పరీక్షలకు ఒక నెల ముందు రూంమేటు సత్యనారాయణ, రామానుజులును ఒకరోజు అర్ధరాత్రి ఆత్మీయంగా అడిగాడు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ డిజైన్స్ పేపరును ఇద్దరూ కలసి మథిస్తున్నప్పుడు మధ్యలో అడిగాడు:

"మా నాన్నకు నువ్వంటే ఇష్టం. ఈ నాలుగేళ్ళలో ఇక్కడికి మూడు నాలుగు మార్లు వచ్చి నిన్ను చూశాడు కదా. ఏమన్నాడో తెలుసా ? నువ్వు నా రూంమేటుగా దొరకటం నా అదృష్టమట. ఎలాగూ మన చదువు ముగుస్తోంది. మా ప్రాంతాలు నువ్వు చూళ్ళేదు కూడా. సముద్రం కూడా నువ్వింతవరకు చూళ్లేదన్నావు, ఒక మారెప్పుడో, కదా? మా విశాఖలో రెండు రోజులు సరదాగా తిరగవచ్చు. ఉక్కు ఫ్యాక్టరీ, హార్బర్, మిగతా ఇండస్ట్రీస్ ఓపికుంటే చూడొచ్చు. ఆంధ్ర యూనివర్శిటీ కాంపస్‌లోనే మేముండేది. క్వార్టర్స్ బావుంటాయి. నువ్వు ఇష్టపడతావు. అక్కణ్ణించి అరకు వెళ్దాం. వెళ్ళేప్పుడు రైల్లో వెళ్దాం. తిరిగి వచ్చేప్పుడు బస్సులో వద్దాం. అరకు లోయ యమగా వుంటుంది. నీకింకా బాగుంటుందనుకో. అరకులో అన్నయ్య

ఇటీవలే ఫారెస్టాఫీసరుగా చేరాడు. పైగా పెళ్లికాలేదు. అన్నయ్యతోనే మనం నాలుగైదు రోజులుందాం. తర్వాత మీ ఊరు వెళ్దువుగానీ. మనకు కావలసింది చార్జీలు, జేబు ఖర్చులే కదా? నువ్వు వచ్చి తీరాలి.."

సత్యనారాయణ కాక మరొకరెవరైనా పిలచి వుంటే "నేరుగానూ ఊరుకుపోవాల" అని వుండేవాడు రామానుజులు. సత్యనారాయణ అంటే రామానుజులుకు చచ్చేంత ఇష్టం. నాలుగేళ్లు క్లాస్‌మేట్. ఒకే రూంమేట్. రాష్ట్రేతర ప్రాంతంలో - కొల్హాపూర్‌లో - కష్ట సుఖాలన్నిటిలో తోడున్నవాడు. పోయిన సంవత్సరం చెల్లెలు పెళ్ళికి పిలుస్తూనే విశాఖ నుంచి ఊరొచ్చాడు.

మిత్రుడి పిలుపును రామానుజులు కాదనలేకపోయాడు.

ఇప్పుడు డబ్బులు చేతులో వున్నాయి. రామానుజులుకు జమా ఖర్చుల పద్దులు తలలో మెదల్లేదు. అనుభవ దాహం అధికమైంది. సుకుమారమైన అనుభూతులు తొందరించాయి. తన ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ చదువుకు అవసరమయ్యే మరింత ప్రత్యక్ష జ్ఞానమేదో అందుతుందని ఆరో ఇంద్రియం ఆరాటపెట్టింది. సత్యనారాయణ వెంట రామానుజులు బయలు దేరాడు.

ఆంధ్ర యూనివర్శిటీ ఆవరణలోని రకరకాల పెద్ద పెద్ద చెట్లనూ, అక్కడి వృక్ష సంపదనూ చూసి, సత్యనారాయణ వాళ్లుంటున్న క్వార్టర్స్ కాంపౌండ్‌లోని ఒక పెద్ద చెట్టుకు కట్టిన ఉయ్యాలలో ఊగి, రామానుజులు ఆకులో ఆకయ్యాడు; పూవులో పువ్వయ్యాడు; నునులేత రెమ్మయ్యాడు. నగరంలోని ఆ అడవి కాని అడవిలో దాగిపొయ్యాడు. ఊగిపొయ్యాడు. క్వార్టర్స్ కాంపౌండ్‌లో చెట్ల నుండి రాలిన నేరేడు పండ్లను చిన్న పిల్ల వాడి లాగా ఏరుకొని, తుడుచుకొని, చప్పరించి వగరును ఆనందించాడు. స్కూళ్లో చదువుకునేటప్పుడు ఊళ్ళోని చెట్లెక్కి బంకీర కాయలు, జమ్మి కాయలు,చీమ చింతకాయలు తిన్న బాల్యానందంకంటే ఎక్కువగా ఆనందాన్ని అనుభవించాడు - ఆ క్వార్టర్స్ చుట్టూ వున్న పండ్ల చెట్ల మధ్య. ఊళ్ళో ఇంటికి ఆనుకునేవున్న కళ్లంలోని బ్రహ్మాండమైన వేపచెట్టులో వుండిన బాల్య స్మృతులు ఆ సమయంలో వెలికివచ్చాయి. తమ ఊరి పర్యావరణ సంపదలో పెద్ద భాగంగా నిలిచిన తమ స్వంత వనం ఎల్లమ్మ వనం- గిలిగింతలు పెట్టింది. ఆ వనంలో చిన్నప్పుడాడిన ఆటలూ, వర్షాకాలంలో ఉరుములు ఉరిమినప్పుడు పుట్టగొడుగుల కోసం వెతుకులాటా జ్ఞాపకానికి వచ్చాయి. ఊరి గొడ్లన్నీ ఆ నీడల్లో రోజూ సేదదీరే దృశ్యం కళ్ళల్లో మెదిలింది.

రామానుజులును యారాడ కొండ ఆకట్టుకోలేదు. సముద్రం మాత్రం అది చూసినంతసేపూ గుండె గొంతుకలో కొట్లాడింది. రామానుజులుకు విశాఖ నచ్చింది. పరిశ్రమల కాలుష్యంతో సైతం నచ్చింది; సముద్రం పీతల కూరతో కూడా నచ్చింది. అప్పాయమ్మలూ నూకాలమ్మలూ, సింహాచలం చీరెకట్లూ, తోడాలు, కడియాలు, బులాకలు, చెవి ఆభరణాల్తో సాగిన చెవులూ - వీటన్నింటితో నచ్చింది. అడ్డపొగతో కూడా నచ్చింది.

అరకు లోయలోకి అడుగుపెడుతూనే రామానుజులుకు ఏదో అద్భుత లోకంలోకి వచ్చినట్లయింది. కంటి చూపు పారినంత వరకూ ముదురుపచ్చ పట్టు చీరెలు కట్టుకున్నట్లు ఆ కనుమలూ, చిక్కటి తోపులూ, చల్లటి గాలి గుసగుసలూ, చెట్ల మీద రంగు రంగుల పక్షులూ, చెట్లకు వేలాడే పిట్టలూ, గర్భిణీ స్త్రీల్లాగా నడిచే మబ్బులూ, వాన చినుకుల పలచటి తెరవెనుక కన్పించీ కన్పించకుండా కదలాడే పచ్చటి నీడలూ - చూస్తూ 'ఇంత ఇంత పర్యావరణ సౌభాగ్యం మన దేశంలోనే, మన రాష్ట్రంలోనే వుందా?, అని విస్మయపడ్డాడు. సత్యనారాయణ అన్నయ్య జగదీశ్వరావు ముందు మూడో రోజు సాయంత్రం రామానుజులు

తన విస్మయాన్ని ప్రకటించాడు.

తమ్ముడివైపు చూసి, జగదీశ్వరరావు నవ్వుతూ రామానుజులును మెచ్చుకున్నాడు:

"రామానుజులుకు కవుల కుండవలసిన భావుకత్వం వుంది"

రామానుజులు ఆ మాటకు సిగ్గుపడ్డాడు. సంకోచంగా అడిగాడు:

"నాకు కవిత్వం రాదు సార్. అయినా భావుకత్వం కవుల గుత్త సొమ్మేమీ కాదు కదా సార్? మీరు ఎం.ఎస్‌సి. బాటనీ చదివారనీ, ఎం.ఫిల్ కూడా చేశారనీ సత్యం నాతో అన్నాడు. మీరు కావాలనే, ఇష్టపడే ఈ ఉద్యోగం ఎంచుకున్నారని కూడా సత్యం అన్నాడు. ఏ మాత్రం భావుకత్వం లేకుండా ఇక్కడ ఈ ఉద్యోగం చెయ్యగలరా ?"

"నాకా భావుకత్వం?" జగదీశ్వరరావు బిగ్గరగా నవ్వాడు.

ఏం చెబుతాడోనని జగదీశ్వరరావు ముఖంలోకి రామానుజులు చూస్తున్నాడు. గార్డు టీ తెచ్చాడు.

"ముందు టీ తాగండి' అన్నాడు జగదీశ్వరరావు

ముగ్గురూ టీ కప్పులందుకున్నారు.

టీని నెమ్మదిగా పీలుస్తూ జగదీశ్వరరావు చెప్పాడు :

"ఇక్కడ కావలసింది భావుకత్వంకాదు, ఉద్యోగ లక్ష్యం, అడవుల్ని కాపాడే ధర్మం ... అన్నట్లు ఈ లోయలోని గిరిజనుల్ని గమనించేవుంటారు."

గత సాయంకాలం వాగులో నీటికీ, స్నానానికీ వచ్చిన గిరిజన స్త్రీల అర్ధనగ్న శరీరాల్ని రామానుజులు చూడకపోలేదు. దుమ్ము గుడ్డిలో, కంఠబవుసుగూడలో, చొంపిలో చొచ్చుకొని వస్తున్న నాగరికత మధ్య చూసిన మారీ మారని గిరిజన జీవితాన్ని మిత్రులిద్దరూ గమనించకపోలేదు; చర్చించకపోలేదు. అందుకే జగదీశ్వరరావు ప్రశ్నకు రామానుజులు తలాడించాడు.

జగదీశ్వరరావు చిన్న ఉపన్యాసానికి సిద్ధమై వున్నట్లు ఆరంభించాడు :

"ఈ అరకులోయ విస్తీర్ణం ఎంతో తెలుసా ? 361 చదరపు మైళ్ళు. అరకు చుట్టు పట్లే డెబ్భై, ఎనభై గిరిజన గూడేలున్నాయి. ఇంత అటవీ సంపద వుంది. మరో ఇరవై ముప్పై ఏళ్ళ వరకు ఈ సంపదంతా వుంటుందా ? అనేదే పెద్ద ప్రశ్న. అసలు గుట్టు కొంత లోపలికి వెళ్తే తెలుస్తుంది. ఏదో జబ్బు చేసి ఈకెలూడిన కోళ్లల్లాగా కొండ చాళ్లు కన్పిస్తాయి. పోడు.. పోడు వ్యవసాయం. అరకు మీ ప్రాంతంలోని కొండల్లాగా అయిపోతుందనే భయం. పోడును మాన్పించాలని మా ప్రయత్నం. కాఫీ ప్లాంటేషన్లతో వాళ్లను మార్చాలని ప్రయత్నం. పర్యావరణ సమతూకం దెబ్బతినకుండా ప్లాంటేషన్ ప్రాజెక్టు అభివృద్ధి చేయాలని మేము. ఇక్కడ భూమి కోతను నివారించటం ఒక సమస్య. భూసారాన్ని కాపాడ్డం మరొక సమస్య. వృక్ష సంపదను రక్షించటం పెంచటం మరొక పెద్ద సమస్య. అందుకే ఈ ఉద్యోగం ఎన్నుకుంది. ప్లాంటేషన్ ప్రాజెక్టు ఇన్‌ఛార్జినేను ..."

"ఇది భావుకత్వమే కదసార్?" రామానుజులు ప్రశ్నకు జగదీశ్వరరావు నవ్వాడు.

"ఏదో ఒకటి... తిరుపతి కొండమీద వరుసగా కూచోబెట్టి గుండ్లు గొరిగినట్లు అడవుల్ని గొరిగితే ఏదీ మిగల్దు," జగదీశ్వరరావు మనిషంతా కదిలిపోతూ నవ్వి, చల్లారిన టీని తాగడం పూర్తి చేశాడు. అన్నయ్య వేసిన జోకుకు సత్యనారాయణ పదే పదే నవ్వాడు. రామానుజులు నవ్వినా, ఎక్కడో కలుక్కుమంది.

జగదీశ్వరరావు మరిన్ని వివరాలు ప్రస్తావించాడు :

"ఇక్కడి గిరిజనులు ఇటిం పండుగ అని ఒకటి ప్రతి ఏడాదీ జరుపుకుంటారు.

ఎనిమిది దినాలుంటుంది అది. మగవాళ్లంతా వేటకు వెళ్లాలి. వేటాడి తేవాలి. పంచుకోవాలి. మేము వేటను నిషేధించినా, జంతువులకూ, పక్షులకూ అంతో ఇంతో నష్టం వుండి తీరుతుంది కదా? ఇక్కడి జీవావరణం కూడా సంక్షోభంలో వుంది"

"అడవుల్ని కాపాడ్డానికి మనకు చిప్కో ఆందోళన లాగా ఉద్యమాలు వస్తేబాగుంటుంది". సత్యనారాయణ తొలిసారిగా నోరు విప్పాడు.

"అప్పికో ఉద్యమం ఉంది కూడా కదా - కేసు నడుస్తున్నది", రామానుజులు జగదీశ్వరరావు వైపు తిరిగి 'మీ అభిప్రాయం చెప్పండి' అన్నట్లు చూశాడు.

కుర్రాడు తెలివైనవాడే అనుకుంటూ రామానుజులుతో జగదీశ్వరరావు అన్నాడు :

"ఇక్కడి సమస్య అదికాదు. చదువుకున్న వాళ్లెవళ్లో పది మంది చెట్లను చేతుల్తో చుట్టి చెట్లు నరక వద్దంటే తీరే సమస్య కాదు ఇది. గిరిజనులు మారాలి - అసలు అనర్థానికి కారణం వాళ్లే కాబట్టి"

రామానుజులు అనుమాన నివృత్తికోసం అడిగాడు:

"సర్దార్ సరోవర్, తెహ్రి, కోయల్‌కార్, సువర్ణరేఖ హైడల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలన్నీ అంతే నంటారా?"

జగదీశ్వరరావు తబ్బిబ్బు పడ్డాడు. టేబులు మీదున్న టీ కప్పు, సాసరుతో ఆడుకుంటూ తనలో తాను ఆలోచించుకుంటున్నట్లుగా అన్నాడు:

"అవి అభివృద్ధికి వ్యతిరేకంగా జరిగే గొడవలు.."

సరిగ్గా ఆ నసుగుడప్పుడే, విశాఖనుంచి కన్సర్వేటర్ కుటుంబంతో సహా వచ్చి గెస్ట్ హవుస్‌లో వున్నాడన్న వార్త వచ్చింది. జగదీశ్వరరావు హడావుడిగా బయటకు వెళ్లిపోయాడు.

అరకులో రామానుజులు, సత్యనారాయణ మరి రెండు దినాలున్నారు. ఆ రెండు రోజుల్లో జగదీశ్వరరావుకు తీరికే లేదు. రామానుజులు కళ్లకు అలసట లేదు.

అరకు నుంచి విశాఖ, విజయవాడ, ప్రొద్దుటూరుల ద్వారా స్వగ్రామానికి తిరిగి వస్తున్నప్పుడు రామానుజులు, జగదీశ్వరరావుతో చర్చించిన విషయాలగురించి, తాను ప్రత్యక్షంగా చూసిన దాన్ని గురించి తెగ ఆలోచించాడు. తన నాలుగేళ్ల చదువుకూ పర్యావరణ సమస్యలకూ మధ్యవుండే విషమ సంబంధాన్ని గురించి మధన పడ్డాడు. ఆలోచనలు గజిబిజిగా, చిందరవందరగా సాగాయి. ఆలోచనలకూ, ప్రకృతిలోని సమస్యలకూ, అనుభూతులకూ మధ్య లంకెలు లేవు. దొరకలేదు కూడా. నీటి పారిశుద్ధ్యం, వాయు కాలుష్యం, పరిశ్రమలు విడిచే కాలుష్యం, తుక్కు పారిశుద్ధ్యం, పారిశ్రామిక ఆరోగ్యం, డిజైన్లూ వగైరా పాఠ్య ప్రణాళికలోని అంశాలన్నింటినీ తాను శ్రద్ధగా చదివాడు. వాటికీ అరకు లోయలో కూలుతున్న సౌందర్యానికీ, మిగిలిన సౌభాగ్యానికీ సంబంధం లేదనుకున్నాడు. రోగకారణాలు తెలియని రోగ చికిత్సను మాత్రమే తన చదువు తనకు నేర్పిందేమో? అనే అనుమానంలో పడ్డాడు. రామానుజులును మరింత అయోమయంలో పడవేసిన పదం జగదీశ్వరరావు ప్రస్తావించిన అభివృద్ధి. పోడు వ్యవసాయం కోసం అడవుల్ని నరకడం, అభివృద్ధి పేరుతో కాఫీ తోటల్ని పెంచటం, సర్దార్ సరోవర్ అభివృద్ధికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించటం -వీటి మధ్య పొంతన కనపడడం లేదు. రామానుజులుకు ప్రకృతి ఒక పద్మవ్యూహ్యం లాగా కన్పించింది. యాత్రలో రామానుజులు ఒక్కటి మాత్రం ఖచ్చితంగా అనుకున్నాడు. పర్యావరణాన్నీ, జీవావరణాన్నీ కాపాడుకునే తపన మనిషన్నవాడికి అవసరం.

విజయవాడ -ప్రొద్దుటూరు బస్సులో ప్రొద్దుటూరు దిగి, రామానుజులు ప్రొద్దుటూరు. పులివెందుల బస్సెక్కాడు. ముద్దనూరు దాటి, దుద్యాల దాటి మల్యాల కనుమ గుండా

బస్సు వెళ్తోంది. కిటికీలోంచి కొండల్ని - బోడిగుండ్ల లాంటి కొండల్ని -చూసి రామానుజులు - ఎన్నో సార్లు చూసినవే అయినా అప్పుడు - 'దారుణం, ఘోరం' అని అనుకున్నాడు. మల్యాల సత్రం వద్దకు బస్సు వచ్చే సరికి రామానుజులుకు ఊరిగాలి సోకింది. ఊరివాసన వేసింది. మల్యాల సత్రం ముందున్న చెట్లను చూసి ఆనంద మైంది. మసీదు కనపడుతోంది. చెట్లూ, ఇళ్లూ, కళ్లాలూ, వాములూ కనబడుతున్నాయి. కన్న ఊరు వచ్చేసింది. గుండెల నిండుగా ఊపిరి పీల్చుకొని సామాన్లు సర్దుకొని స్టాప్‌లో దిగాడు.

తొమ్మిది నెలల తరువాత వచ్చిన ఇంజనీరు కొడుకును చూసి కన్నతల్లి కళ్లతోనే పలకరించి సంతోషపడింది. చిన్నాన్న కుశల ప్రశ్నలతో రామానుజులు కడుపు నిండిపోయింది. చిన్నాన్న గాంభీర్యాన్ని చూస్తే రామానుజులుకు భయం, అభిమానం కూడా. చిన్నాన్న పిల్లలు - చదువచ్చిన వ్యవసాయంలోకి దిగిన పధ్నాలుగేళ్ళ తమ్ముడూ, ముగ్గురు చెల్లెళ్లూ అరకు నుంచి రామానుజులు అపురూపంగా అతి జాగ్రత్తగా తెచ్చిన పెద్ద పనస పండును చూసి ఆశ్చర్య పొయ్యారు. "ఎట్లా కొయ్యాల? ఎట్లా కొయ్యాల? ఎట్లా తినాల?" అంటూ రామానుజులును చుట్టుకున్నారు. సత్యనారాయణ అరకులో నేర్పిన మెలకువల్ని ప్రదర్శించి, రామానుజులు పండుకోసి, తొనలు తీశాడు. పండు వాసన పిల్లలందరికీ గమ్మత్తుగా వుంది. తొనలు రుచి అందరికీ నచ్చింది.

రాత్రి పొద్దు పోయేంతవరకు తమ్ముడికి, చెల్లెళ్ళకు అరకు విశేషాలను రామానుజులు విసుగు పడకుండా చెబుతూనే వున్నాడు. దూరంగా మంచంలో పడుకొని చిన్నాన్న వింటున్నట్లు గమనించకపోలేదు. రామానుజులు చెప్పటం ఆపి మంచినీళ్లు తాగుతున్నప్పుడు చిన్నిచెల్లెలు ఒక ప్రశ్న వేసింది :

"మనకిన్ని కొండలున్నాయే. అడవెందుకు లేదు?"

"ఒకప్పుడుండేదంట. మల్యాల కనుమంటే ఏందనుకున్నావు? మజాకా ? రాములు తాత నడుగు, మన కనుమ సంగతి", తమ్ముడన్నాడు.

"ఇప్పుడెందుకు లేదంటా? " చిన్న చెల్లెలు రెట్టించింది.

"ఇంక చాల్లే పండుకోండ్రా... చాలా పొద్దుపొయ్యింది", చిన్నాన్న జోక్యంతో అందరి నోళ్లూ మూతపడ్డాయి.

రామానుజులుకు వెంటనే నిద్రరాలేదు. ఆలోచనలో పడ్డాడు.

గిరిజనుల్లా పోడు వ్యవసాయం ఒకప్పుడిక్కడా వుండేదేమో. తర్వాత తర్వాత వ్యవసాయ పనిముట్లకో, వంట కట్టెలకో, మిద్దెలకో, మేడలకో అడవుల్ని నరుక్కుంటూ వచ్చివుంటారు. ఏ వ్యాధో వచ్చి, సత్రానికి దూరంగా ఒకప్పుడున్న మొగలి పొదల మాదిరి అడవి నాశనమైందేమో? సత్రాల దగ్గరో, బావుల దగ్గరో ఎన్నడో ఎవరో నాటిన వేపచెట్లు, మర్రిచెట్లు లేకపోయి వుంటే ఈ ఊర్లన్నీ ఒలుకల కట్టల మాదిరి కన్పించేవి. ఆ ఒలుకల కట్టలో ఇళ్లన్నీ గోరీల మాదిరి. తమ ఎల్లమ్మవనం వేసింది మూడు తరాల కిందటి తమ ముదిజేజి అని ఊళ్లో ఘనంగా చెప్పుకుంటారు. ఎందుకు వేసిందో? గొడ్ల నీడకోసమేనా? పుణ్యానికా ? తమ కళ్లంలో వేపచెట్టు నాటింది కూడా ఆమేనని అంటారు. తర్వాత రెండు తరాల వాళ్లు వీటి మీదెందుకు శ్రద్ధ చూపలేదు ? ఆసక్తి లేకనా ? తెలియదా ? మగవాళ్ళు పోనీలే. పొలంలో నిత్య సంబంధమున్న ఆడవాళ్లు ?

చిక్కుముడి వీడలేదు కానీ, రామానుజులుకు నిద్ర ముంచుకొచ్చింది.

ఉదయాన్నే రామానుజులుకు ఎల్లమ్మ వనం వైపు వెళ్లాలనిపించింది. వనం లేదు. చెట్లను వేళ్లతో సహా కుళ్లగిస్తే, మిగిలిన గుంతలన్నీ కన్పించాయి. తొమ్మిది నెలలకిందట

సెలవుల్లో వచ్చినప్పుడున్న వనం స్థానంలో వికృతమైన గుంతలున్నాయి. రామానుజులు నిశ్చేష్టుడయ్యాడు.

రామానుజులుకు చిన్నాన్న మీద విపరీతమైన కోపం వచ్చింది. చదువుకున్న మూర్ఖుడు. పూర్వీకుల జ్ఞాపకాల్ని సైతం ధ్వంసం చేసే మనిషి అని కసిదీరా మనసులో తిట్టాడు. దిగులు, బాధ, కోపం గంట వరకూ తగ్గలేదు.

'చిన్నాన్నను నిలదీసి అడగాల. ఏం భయమా?' అనుకుంటూ ఇంటికి వచ్చిన రామానుజులుకు గొడ్డళ్ళ నరుకుడు శబ్దాలు కర్ణకఠోరంగా విన్పించాయి. ఎవరో తరుముతున్నట్లు రామానుజులు కళ్లంలోకి పరుగెత్తాడు. చేవదేలిన బ్రహ్మాండమైన వేపచెట్టు మొదలు మీద గొడ్డళ్లు చిందులు దొక్కుతున్నాయి. దూరంగా చొప్పవామికింద మంచంలో చిన్నాన్న తలవంచుకొని నేలను చూస్తూ బీడీతాగుతూ రామానుజులుకు కన్పించాడు. ఆ పక్కన్న కూర్చున్న పెద్ద మనిషి గొడ్డళ్లను పర్యవేక్షిస్తున్నాడు.

రామానుజులు విసురుగా వచ్చి మంచం దగ్గర నిల్చున్నాడు. ఆవేశం పట్టలేకపోయాడు:

"ఏందిది చిన్నాన్నా ? మీకేమన్నా పిచ్చి పట్టిందా? ఎల్లమ్మ జేజి తోపును కొట్టించినారు. ఇప్పుడీ చెట్టును..", ఆ పైన రామానుజులుకు మాట పెగల్లేదు.

"ఇంట్లోకి పోదాం పద" అంటూ చిన్నాన్న రామానుజులు చెయ్యి పట్టుకున్నాడు. చిన్నాన్న చెయ్యి చల్లగా వుంది. ఇంట్లో మంచం మీద రామానుజులును బలవంతంగా కూర్చోబెట్టి నడవలు నడుస్తూ చిన్నాన్న అన్నాడు:

"చెట్లను ఏ రైతూ నాశనం చేసుకోడు - అవసరం గొంతు మీదికొస్తే తప్ప"

"ఏం అవసరమొచ్చింది?" రామానుజులు గొంతులో జీరపలికింది.

"మీనాన్న చనిపోయాక మిగిలిన అప్పులు, అమ్మి సుభద్ర పెళ్లి, నీ ఇంజనీరింగు చదువు, పండీ పండని పంటలు.. వనం అమ్మి అప్పులు గట్టినా".

"పొలం అమ్మకూడదా?"

"బయట చెట్లకుండే గిరాకీ, ఊళ్లో మన పొలాలకు లేదు,"

సూటిగా చిన్నాన్న రామానుజులు కళ్లల్లోకి చూస్తూ మాటలు నొక్కి పలికాడు, పరమ శాంతంగా, ఏ వికారమూ ముఖంలో కన్పించనీకుండా.

"పోనీ .. కళ్ళంలోని ఆ వేప చెట్టునన్న మిగిలించకూడదా?" పిల్లలు ఆడుకోడానికి మా స్కూళ్ళప్పుడూ అది ఉపయోగపడేది. ఆ మాత్రం మమకారం లేదా?"

చిన్నాన్న కరుకుగా అన్నాడు:

"మమకారాల కేమొచ్చింది? మనుషుల కన్నా మాన్లెక్కువకాదు. పరీక్షలయ్యాక కొన్ని బాకీలు తీర్చాలన్నావు. విశాఖట్నం, అరకు పోవాలన్నావు. రెండు వేలు కావాలని రాసినావు. ఊర్లో దొరకలేదు. కడకు ఆ కలప అంగడి మల్లారెడ్డి ఇచ్చినాడు, చెట్టుమీద ఆశతో..."

రామానుజులు నెత్తిమీద గొడ్డలి మీద గొడ్డలి వేట్లు పడినట్లయింది. అంతవరకు తెగేదాకా వస్తే తన భాగం ఆస్తిలో కట్టుకోమనీ, వేపచెట్టును చేతులతో చుట్టి రక్షించుకోవాలనీ అనుకున్న జ్ఞానం ఛిద్రమైంది. చిన్నాన్న కళ్ళల్లోకి చూడలేక, అశక్తతను సహించలేక రామానుజులుకు నోట మాట రాలేదు. చెయ్యీ కాలూ ఆడలేదు.

గొడ్డళ్ల నరుకుడు చప్పళ్లు విన్పిస్తూనే వున్నాయి. ○

● -నవంబరు 21-5 డిసెంబరు 1992 ఇండియా టుడే ●